ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
బుధవారం 24 సెప్టెంబరు 2025



మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆసుపత్రి

- 204 మందికి గాను, 160 మందితోనే పని
- దాదాపు 40 మంది లేకున్నా ఉన్నట్లు చూపిస్తున్న పరిస్థితి
- అగ్రిమెంట్ నిబంధనలకు శ్రీసాయి ఏజెన్సీ తిలోదకాలు
- మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో ఇదీ దుస్థితి

'పారిశుధ్యం'లో అవినీతి కంపు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ అవినీతి కంపులో కూరుకుపోయింది. పారిశుధ్య నిర్వహణ టెండరును దక్కించుకున్న శ్రీసాయి ఏజెన్సీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. అగ్రిమెంట్‌లో పొందుపరిచిన నిబంధనలకు తిలోదకాలు ఇచ్చింది. ఒప్పందం ప్రకారం 204 మందిని నియమించాల్సి ఉంది. కానీ 160 మందినే నియమించుకొని వారితోనే పని చేయిస్తోంది. కానీ కార్మికులు పూర్తి స్థాయిలో ఉన్నట్లు రిజిస్టర్‌లో చూపిస్తూ ఆసుపత్రి అధికారులను తప్పుదోవ పట్టిస్తూ డబ్బులు దండుకుంటోంది.


అటెండర్లు లేకపోవడంతో వీల్‌చైర్‌పై రోగిని తీసుకెళ్తున్న కుటుంబ సభ్యుడు

అంతే కాకుండా దాదాపు 16 మందికి నిబంధనలకు విరుద్ధంగా జీతాలు ఇస్తోంది. దీంతో పాటు 40 మంది వరకు ఎక్కువగా చూపించి వారి వేతనాలను కూడా స్వాహా చేస్తోంది. జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ ఏజెన్సీ అవినీతి, అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం...

450 పడకలకు టెండరు

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 450 పడకలకు పారిశుధ్య నిర్వహణ టెండర్లను శ్రీసాయి ఏజెన్సీ దక్కించుకున్నది. గత ఏడాది 2022 జూన్ నుంచి ఇప్పటి వరకు అదే కొనసాగుతోంది. ఏజెన్సీ నిర్వహణకు ప్రభుత్వం ప్రతీ బెడ్డుకు నెలకు రూ. 7,500 చొప్పున రూ.33.75 లక్షలు చెల్లిస్తోంది. ఇందులో సూపర్‌వైజర్లు, పేషెంట్ కేర్ అటెండర్లు, సెక్యూరిటీ, స్వీపర్లను నియమించుకొని పనులు చేయించాల్సి ఉంటుంది. ప్రతీ నెల ఆసుపత్రి సూపరింటెండెంట్ వారి పనికి సంతృప్తి చెంది ఆమోదిస్తేనే ఆ బిల్లు వస్తుంది.

ఆసుపత్రిలో 650 పడకలు

జనరల్ ఆసుపత్రిలో కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. వాస్తవానికి 450 పడకలు ఉండాలి. కోవిడ్ తర్వాత అదనంగా 200 పడకలు ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 650 బెడ్లు ఉన్నాయి. ప్రస్తుతం పని చేస్తున్నవారి సంఖ్య 160 మందికి లోపే ఉంటోంది. సూపర్‌వైజర్లు 15, సెక్యూరిటీ సిబ్బంది 40, పేషెంట్ కేర్ అటెండర్లు 40 మంది కాగా, మిగతా వారు స్వీపర్లుగా పని చేస్తున్నారు. వారి పరిస్థితి దారుణంగా ఉంది. ఆసుపత్రిలో దాదాపు 30కి పైగా వార్డులు, ఎంసీహెచ్ భవనం ఉండగా, 60 నుంచి 80 మంది స్వీపర్లతోనే పని చేయిస్తున్నారు. ఆసుపత్రిలో ప్రతీ రోజు 500 నుంచి 600 వరకు అడ్మిషన్ రోగులే ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో వార్డులన్నీ శుభ్రం చేసేందుకు రోజంతా పడుతోంది. పేషెంట్ కేర్ అటెండర్ల సంఖ్య కూడా వస్తున్న రోగులకు సరిపోవడం లేదు. రోగి వెంట వచ్చే బంధువులు, కుటుంబ సభ్యులే వీల్‌చైర్లు, తోపుడు బండ్లు తీసుకెళ్లాల్సి వస్తోంది. వార్డులు కూడా కంపుకొడుతున్నాయి. ఆసుపత్రి పరిసరాలు కూడా అధ్వాన్నంగా మారాయి.

ఏజెన్సీ నిర్వాహకుల ఇష్టారాజ్యం

ఏజెన్సీ నిర్వాహకులపై పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వానికి ఇచ్చిన ఒప్పంద పత్రంలో 204 మంది పారిశుధ్య కార్మికులను తీసుకున్నట్లు చూపించారు. కాని అక్కడ పనిచేస్తున్నది మాత్రం కేవలం 160 మందే. ఇంకా 44 మంది తక్కువగానే ఉన్నారు. వారిలోనూ ప్రతీ రోజు 140 నుంచి 160 మంది వరకే పని చేస్తున్నారు. కానీ 204 మంది లెక్కన బిల్లులు తీసుకుంటున్నారు.

బోగస్ పేర్లతో సంతకాలు చేసి నెల నెల బిల్లులు తీసుకుంటున్నారు. ఇలా లెక్కలో లేని 44 మందికి గానూ రూ.5.80 లక్షల వరకు ఏజెన్సీ నిర్వాహకులు దండుకుంటున్నారు.

మరో 16 మందికి ఏజెన్సీ నుంచే జీతం

పారిశుధ్య కార్మికుల పేరు మీద మరో 16 మందిని నియమించుకొని వారితో ఆసుపత్రిలోని వివిధ విభాగాలలో పని చేయిస్తున్నారు. కానీ వారికి ఏజెన్సీ నుంచే జీతాలు చెల్లిస్తున్నారు. వారి పని తీరు బాగా ఉందని అధికారులు 'సాటిస్ఫై సర్టిఫికెట్' ఇవ్వకపోయినా రాష్ట్ర స్థాయి ప్రజా ప్రజాప్రతినిధులతో ఒత్తిడి చేయించి బిల్లులు చేయించుకుంటున్నారు.

ఏజెన్సీ నిర్వాహకులతో ఆసుపత్రి అధికారులు కూడా కుమ్మక్కైనట్లు తెలుస్తోంది. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి కార్మికుల పనితీరుపై వార్డుల వారీగా నర్సింగ్ సిబ్బంది, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు కూడా 70 శాతం ఉన్నట్లు రిపోర్టులు ఇస్తున్నారు. కాని ఆసుపత్రి ఉన్నతాధికారుల కార్యాలయానికి వచ్చేసరికి అది 95 శాతానికి మారిపోతోంది. ఫలితంగా ఏజెన్సీ వారికి దాని ప్రకారమే బిల్లులు వస్తున్నాయి.

పూర్తి స్థాయిలో పరిశీలిస్తాను

సూపరింటెండెంట్‌గా ఇటీవలే చార్జ్ తీసుకున్నాను. ఒప్పందం ప్రకారం 204 మంది కార్మికులు ఉండాలి. కానీ తక్కువగా ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. వారికోసం బయోమెట్రిక్ వ్యవస్థను ఏర్పాటు చేయిస్తున్నాను. దీని వలన ఎంత మంది ఉన్నారు, వారిలో ఎంత మంది పనిచేస్తున్నారో తెలుస్తుంది. దాని ప్రకారమే ప్రతీ నెల సాటిస్ఫై సర్టిఫికెట్ ఇస్తాం. దీనిపై పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాను. ఏజెన్సీ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి అగ్రిమెంట్‌లోని అంశాలపై చర్చిస్తాను.

- డా. రంగా అజ్మీర, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్.

సౌత్‌జోన్ క్రీడాకారుల ఎంపిక 7

ఎక్కడున్నావో చెప్పు..

వస్తున్నా!

- కమిషనర్‌కు మాజీ కౌన్సిలర్ ఫోన్ కాల్
- అసభ్యంగా దూషించడంతో పోలీసులకు ఫిర్యాదు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్‌కు మాజీ కౌన్సిలర్ ఫోన్ చేసి దుర్భాషలాడారు. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పద్మావతీ కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేశారు. పరుష పదజాలంతో దూషిస్తూ ఎక్కడున్నావో చెప్పు.. వస్తున్నా అనడంతో, ఆఫీసులోనే ఉన్నాను, రమ్మంటూ కమిషనర్ బదులిచ్చాడు. అన్నట్లుగానే సాయంత్రం 5 గంటల సమయంలో కార్యాలయానికి వెళ్లాడు. కమిషనర్ చాంబర్‌లోకి వెళ్లగా ఆయన లేరు. ఆయన ఈ విషయంపై అప్పటికే పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్నారు. కమిషనర్ కార్యాలయంలో నుంచి మాజీ కౌన్సిలర్ బయటకు రాగానే అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించేశారు. దీనిపై రవికిషన్‌రెడ్డి స్పందిస్తూ తాను కౌన్సిలర్‌గా ఉన్నపుడు తన వార్డులో పనులు పెట్టించుకున్నానని, కౌన్సిల్‌లో తీర్మానం చేశామని తెలిపారు. కొత్తగా వచ్చిన కమిషనర్ ఆ పనులను డైవర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. అందుకే తాను స్పందించాల్సి వచ్చిందని తెలిపారు. కాగా కమిషనర్, మాజీ కౌన్సిలర్ల మధ్య జరిగిన ఫోన్ సంభాషణను కార్యాలయ సిబ్బంది సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. కమిషనర్‌ను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా, అందుబాటులోకి రాలేదు.


బతుకమ్మతో కలెక్టర్ విజయేందిర బోయి

చిత్తూ చిత్తూల బొమ్మ శివునీ ముద్దుల గుమ్మ

- ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు
- పాలమూరు కలెక్టరేట్‌లో వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి


పేట ఎస్పీ కార్యాలయ అవరణలో బతుకమ్మలతో మహిళలు 6

నవదుర్గా.. నమోనమః


మరిన్ని చిత్రాలు 6లో..
మహబూబ్‌నగర్ బ్రాహ్మణవాడీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం

- నారాయణపేట జిల్లాలో 117 కేంద్రాలు
- ప్రభుత్వానికి నివేదించిన జిల్లా అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 71,063 హెక్టార్లలో వరి సాగు


కృష్ణ మండలం టైరోడ్ సమీపంలో కృష్ణనది ఒడ్డున సాగైన వరి

నారాయణపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో సాగు చేసిన వరి కోతలు వచ్చే నెలలో ప్రారంభం అవుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నారాయణపేట జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం అవుతోంది. అందుకు సంబంధించి కలెక్టర్ల ఆధ్వర్యంలో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి బాల్‌రాజ్, డీఎం సైదులు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసి, ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించారు. వచ్చే నెల రెండవ వారం నుంచి వరి కొనుగోళ్లు ప్రారంభించనున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 71,063 హెక్టార్లలో వరి సాగయ్యింది. ఇందులో దొడ్డు రకం 14,981 హెక్టార్లు, సన్న రకం 56,082 హెక్టార్లలో సాగయ్యింది. మొత్తంగా 4,28,838 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అందులో దొడ్డు రకం దాన్యం 96,249 మెట్రిక్ టన్నులు, సన్న రకం 3,32,589 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

వివిధ శాఖల ఆధ్వర్యంలో..

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 117 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు 26, సన్నరకం ధాన్యం కొనుగోలుకు 91 కేంద్రాలను ఏర్పాటు చెయ్యనున్నారు. అందులో ఐకేపీ ద్వారా దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు 10, సన్న రకం ధాన్యం కొనుగోలుకు 48 కేంద్రాలు, సింగిల్ విండో ఆధ్వర్యంలో దొడ్డురకం 15, సన్న రకం 37 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మెప్మాకు సంబంధించి 2 సన్న రకంతో పాటు, మరో 4 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించారు.

'ఏ' గ్రేడ్ ధాన్యం ధర రూ.2,389

ఈ సీజన్‌లో ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ. 2,389, సాధారణ రకానికి రూ. 2,369గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. అలాగే సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్‌ను గతంలో ప్రకటించింది. అందుకోసం సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

78,15,350 గన్నీ బ్యాగులు అవసరం

నారాయణపేట జిల్లాలో వరి కొనుగోలుకు 78,15,350 గన్నీ బ్యాగులు అవసరం ఉన్నాయి. ప్రస్తుతం గోదాంలలో 12,51,032 సంచులు ఉండగా, మిల్లర్ల వద్ద పాతవి 6.50 లక్షల గన్నీ బ్యాగులు ఉన్నాయి. మొత్తం 19,01,032 సంచులు అందుబాటులో ఉన్నాయి. మరో 59,14,418 గన్నీ బ్యాగులను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించ నున్నారు. అలాగే టార్పాలిన్లు 3,510 అవసరం కాగా, 3,029 అందుబాటులో ఉన్నాయి. మరో 481 టార్పాలిన్లు తెప్పించాల్సి ఉంది. ఆటోమెటిక్ ధాన్యం శుద్ధి యాంత్రాలు 117 అవసరం కాగా, 3 అందుబాటులో ఉన్నాయి. మరో 114 తెప్పించాల్సి ఉంది. తేమ పరిశీలన యంత్రాలు 152 అందుబాటులో ఉండగా, ఎలక్ట్రానిక్ కాటాలు 130 సిద్ధంగా ఉన్నాయి.

రైల్వే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

» కేంద్రమంత్రికి ఎంపీ, ఎమ్మెల్యేల వినతి


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ డీకే అరుణ కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్నకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎమ్మెల్యే యన్నం శ్రీ నివాస్‌రెడ్డితో కలిసి ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చి సమస్యలను వివరించారు. పాలమూరు ప ట్టణంలో రైల్వే గేట్లు పడినప్పుడల్లా ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగు తోందన్నారు. పట్టణంలోని తిర్మల్‌దేవుని గుట్ట, బోయపల్లి, తిమ్మసాని పల్లి రైల్వే గేట్ల వద్ద ఓవర్ బ్రిడ్జీలు, సద్దల గుండు, దివిటిపల్లి వద్ద పాద చారుల కోసం ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలను వంద శాతం కేంద్ర నిధులతో ఏర్పా టు చేయాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి నట్లు ఎంపీ, ఎమ్మెల్యేలు తెలిపారు.



బ్రహ్మచారిణీదేవి అలంకరణలో జోగుళాంబ అమ్మవారు



జడ్చర్ల వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అభిరామిదేవి అలంకరణలో అమ్మవారు



అచ్చంపేట కన్యకాపరమేశ్వరి ఆలయంలో వారాహిమాతగా అమ్మవారు



ఉమామహేశ్వరంలో బ్రహ్మచారిణీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



ఫతేపూర్ ఆలయంలో గాయత్రీ దేవిగా మైసమ్మ దర్శనం



పాలమూరు శ్రీనివాస కాలనీలో గౌరీ దేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

నవదుర్గా.. నమోనమః

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ క్షేత్రంలో జోగుళాంబ అమ్మవారు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉమామేశ్వరంలో పార్వతీ దేవి బ్రహ్మచారిణీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి మహబూబ్‌నగర్‌లో గౌరీదేవిగా జడ్చర్లలో అభిరామి అమ్మవారిగా పూజలందుకున్నారు. ఫతేపూర్‌లోని మైసమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పెంపు

బిజినేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునే ఆఖరు తేదీ అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ వి.భాస్కర్ కుమార్ మంగళవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజకీయ చైతన్యానికి శిక్షణ తరగతులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు శిక్షణా తరగతులు ఉపయోగపడుతాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నేటి సమాజంలో మహిళలు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కానీ వాటికి గల కారణాలపై ఆలోచించడంలో వెనుకబడి పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నరేందర్, సీఐటీయూ కార్యదర్శి వర్గ సభ్యులు పుట్ట ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి లక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, కవిత, ఉమా, రేణుక, లలిత, రాణి, పావని పాల్గొన్నారు.

ప్లేట్‌లెట్లు దానం



ప్లేట్‌లెట్లు దానం చేసిన వారికి ధ్రువపత్రాలను అందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

కందనూలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ బాధితున్ని రక్షించేందుకు పట్టణానికి చెందిన శరత్ చంద్ర, రవికుమార్‌లు అత్యవసర పరిస్థితుల్లో మంగళవారం ప్లేట్‌లెట్లు దానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్‌కుమార్ మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలన్నారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేయడాన్ని ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహేందర్ పాల్గొన్నారు.

6 యూనిట్లకే పరిమితమైన జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు ,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ భారీ స్థాయిలో వరద వస్తున్న కారణంగా ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలోని ఆరు యూనిట్ల ద్వారా మాత్రమే విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు సంబంధిత ఎస్ఈ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా గడచిన 24 గం టల్లో 3.164 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలా గే ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 358.673 మిలియన్ యూనిట్లను కొనసాగించినట్లు తెలిపారు. ఎగువ నుంచి భారీ స్థాయిలో వరద వస్తున్న కారణంగా కృష్ణా నది ద్వారా దిగువకు రెండున్నర టీఎంసీలకు పైగా నీటిని విడుదల చేస్తున్న కారణంగా దిగువ జ్వూరాలు ఉత్పత్తి కేంద్రంలో జల విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేసినట్లు ఆయన తెలిపారు. వరద తగ్గుముఖం పడితే తప్ప దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభం అయ్యే అవకాశం లేదని తెలిపారు.

భూ వివాదంతో అన్నదమ్ముల ఘర్షణ

నవాబ్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలతో అన్నదమ్ములు ఘర్షణ పడిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కూచూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ జనార్దన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కూచూర్ గ్రామానికి రాంచంద్రయ్య నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈనెల 21న గ్రామంలో పాఠశాల వద్ద ఉండగా ఆయన తమ్ముడు వెంకటయ్య వచ్చి దూషిస్తూ.. దాడికి యత్నించగా తప్పించుకుని ఇంటికి చేరుకున్నాడు. అక్కడకు తమ్ముడు వెంకటయ్య వెంట తెచ్చుకున్న గొడ్డలితో దాడి చేసి గాయపర్చాడు. ఆయన భార్య చిన్నమ్మ, వారి కుమారుడు అజయ్‌లు కలిసి రాళ్లతో దాడి చేశారు. వారిని వారించేందుకు వచ్చిన మామ కిషన్, అత్త కొండలమ్మలు వచ్చి విడిపించేందుకు యత్నించగా కిషన్‌పై గొడ్డలితో దాడి చేయగా అతని ఎదపై తీవ్ర గాయమైంది. అలాగే రాంచంద్రయ్య కారుపై దాడి చేశారు. వీరిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లో ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నట్లు ఏఎస్ఐ జనార్దన్ తెలిపారు. రాంచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహిళపై రాయితో దాడి.. కేసు నమోదు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం షాపూర్ గ్రామంలో కుంభం సాయమ్మ అనే మహిళపై అదే గ్రామానికి చెందిన కుంభం లక్ష్మమ్మ రాయితో దాడి చేసింది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 22న షాపూర్ గ్రామంలో కుంభం సాయమ్మ, తోటి కోడలు మణెమ్మ మనుమడు విజయ్, మనుమరాలు సాన్వి, కుంభం లక్ష్మమ్మ తోటలో మిరప మొక్కలను తొలగించారు. దీంతో లక్ష్మమ్మ మరిది పెద్ద శేషయ్య, అతని కుమారుడు మహేశ్ సాయమ్మను దుర్భాషలాడారు. మంగళవారం ఉదయం సాయమ్మ ఇంటికి లక్ష్మమ్మ వచ్చింది. తన మిరప తోటలో మొక్కలను నాశనం చేస్తారా అంటూ ఆమె తలపై రాయితో కొట్టడంతో రక్త గాయం అయింది. సంఘటనపై బాధితురాలు సాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పేట ఎస్పీ కార్యాలయ ఆవరణలో బతుకమ్మ సంబురాలు



సంబురాల్లో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

చిత్తూ చిత్తూల బొమ్మ.. శివునీ ముద్దుల గుమ్మ

- ఉత్సాహంగా బతుకమ్మ సంబురాలు
- పాలమూరు కలెక్టరేట్‌లో వేడుకలు
- పాల్గొన్న కలెక్టర్ విజయేందిర బోయి



వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్/నారాయణపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. చిత్తూ చిత్తుల బొమ్మ.. శివునీ ముద్దుల గుమ్మ../ ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. ఏమేమి కాయొప్పునే.. తదితర పాటలు మారుమోగుతున్నాయి. మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయేందిరబోయి బతుకమ్మను ఎత్తుకున్నారు. మహిళా అధికారులు, ఉద్యోగినులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉద్యోగినులతో కలిసి ఆడారు. వేడుకల్లో మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జరీనాబేగం, వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగినులు, వారి కుటుంబ సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి పూజలు చేశారు. మహిళా పోలీసులు వారి కుమార్తెలతో కలిసి బతుకమ్మ ఆడారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్పీ యోగేష్ గౌతమ్ హాజరయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఆర్ఐ నరసింహ, ఎస్ఐలు సునీత, గాయత్రి, శ్వేత, శిరీష, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుంటేనే బహుజనుల బతుకులు బాగు



బహుజన బతుకమ్మ కార్యక్రమ సభలో మాట్లాడుతున్న విమలక్క

కొత్తకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతిని కాపాడుకుంటేనే బహుజనుల బతుకులు బాగుంటాయని బహుజన బతుకమ్మ నిర్వాహకురాలు విమలక్క అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వార్థ పాలకులతో ప్రకృతి విస్ఫోటనం కావడంతో ఎండలు, వానలు, భూకంపాలు సంభవిస్తున్నాయని అన్నారు. అడవులను రక్షించుకుంటే భవిష్యత్ తరాల వారందరికీ మనుగడ ఉంటుందన్నారు. ప్రకృతి అంటేనే ఆడబిడ్డ, ఆడబిడ్డ చల్లగా ఉండాలని అందరూ కోరుకోవాలన్నారు. బతుకమ్మ పండుగను జరుపుకుందామంటే పూలు దొరకడం లేదని, డీజేలు రావడంతో మహిళలు బొడ్డెమ్మ ఆడడానికి రావడం తక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఆటపాటలను కాపాడుకోవడం అందరి కర్తవ్యమన్నారు. అడవులుంటే అమ్మ ఉన్నట్లు, నదులుంటే నాన్న ఉన్నట్లుగా ధైర్యం ఉంటుందన్నారు. ఆదివాసులు, మూలపురుషులు దేశానికి ఎంతో అవసరమన్నారు.

అంతకు ముందు పట్టణంలో బతుకమ్మలతో ర్యాలీగా వచ్చిన మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. రఘు, పృథ్వీరాజ్, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గత పాలకుల నిర్లక్ష్యం



విలేకరుల సమావేశంలో మాట్లాతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్

- ఆగిన 'పాలమూరు - రంగారెడ్డి'
- ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తాం
- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, సెప్టెబంరు 23 (ఆంధ్రజ్యోతి); గత పాలకుల నిర్లక్ష్యం వల్లే పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఆగిపోయిందని మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న కర్వెన రిజర్వాయర్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎస్ఈ జగన్‌మోహన్‌శర్మ, ఈఈ దయానంద్, డీఈఈలు ప్రభాకర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, అబూబకర్ సిద్ధిఖీలతో సమావేశమయ్యారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి ఎంత డబ్బు ఖర్చు అవుతుంది? పనులు ఎంత వరకు జరిగాయి? భూ సేకరణకు ఎంత సమయం పడుతుంది? తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు.

కానీ పదేళ్లు గడిచినా పనులు పూర్తి కాలేదని, చుక్క నీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో నామమాత్రంగా ఒక మోటారును ప్రారంభించి చేతులు దులుపుకున్నారన్నారు. తమ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. పెండింగ్ పనుల పూర్తికి ఇంకా రూ.450 కోట్లు ఖర్చు అవుతుందని, అందుకు సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడామని తెలిపారు. వచ్చే సంవత్సరం జూన్ 15 వరకు కర్వెన రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నర్సింహారెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు కేసీరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్, భూపతిరెడ్డి, రవీందర్ రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వెల్కిచర్ల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



ఊర్కొండ ఆగ్రో రైతు సేవ కేంద్రం వద్ద యూరియా కోసం క్యూలో నిలుచున్న రైతులు

ఊర్కొండ/నవాబ్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఊర్కొండ మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రం వద్ద రైతులు తెల్లవారు జాము నుంచే పడిగాపులు కాశారు. నాలుగు రోజులుగా యూరియా లేక నానా తిప్పలు పడ్డ రైతులు సోమవారం రాత్రి యూరియా వచ్చినట్లు తెలుసుకొని మంగళవారం తెల్లవారుజామునుం చే రైతులు మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్ర చేరుకొని యూరియా కోసం క్యూలో నిలు చున్నారు. మండల వ్యవసాయ అధికారులు, పో లీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు గతంలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయ పనులు వదులు కొని యూరియా కోసం తిప్పలు పడుతున్నామని చర్చించుకోవడం గమనార్హం. సకాలంలో ప్రభు త్వాలు యూరియా అందించి రైతులను ఆదుకో వాలని పేర్కొన్నారు.

● నవాబ్‌పేట మండలంలో యూరియా కొరత అన్నదాతలను వేధిస్తోంది. అధికారులు మండలానికి మంగళవారం 450 బస్తాలు వచ్చినట్లు సమాచారం ఇవ్వడంతో రైతులు ఉదయం నుంచి రైతు వేదిక, సింగిల్ విండో కార్యాలయాలవద్ద వేచిఉన్నారు. మహిళా రైతులు కాలకృత్యాలు తీర్చుకునే వసతి లేక ఇబ్బందులు పడ్డారు. టోకెన్‌లు కేటాయించడంతో వాటిని తీసుకుని సింగిల్‌విండో వద్దకు రైతులు పరుగులు తీశారు. సాయంత్రం యూరియా సరఫరా చేయకపోవడంతో వర్షంలో సైతం అలాగే ఉండిపోయారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండ చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ క్రిష్ణకిషోర్ మంగళవారం తెలిపారు.

వ్యవసాయ కోర్సుల్లో నాణ్యమైన విద్య

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వ్యవసాయవిద్య అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అలాగే భవిష్యత్‌లో నైపుణ్యం గల వ్యవసాయ గ్రాడ్యుయేట్లు రైతులకు అండగా నిలిచేందుకు అవసరమైన పథకాలను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థ సొసైటీ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రాముఖ్యతను, విద్యార్థులను భవిష్యత్‌ను గమనించిన ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకుని వనపర్తి, కరీంనగర్ బీసీ గురుకుల మహిళల వ్యవసాయ కళాశాలను పటిష్టం చేసేందుకు విధానపరమైన అన్ని అంశాలను పరిశీలించినట్లు తెలిపారు.

లంబాడీ భేరీకి వేలాదిగా తరలి రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి విద్యా విభాగం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లంబాడీలకు కేసీఆర్ అన్నం పెడితే, సీఎం రేవంత్‌రెడ్డి సున్నం పెడుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వనపర్తిలో నిర్వహించిన లంబాడీ భేరి సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేసీఆర్ లంబాడీల భవిష్యత్తు కోసం అనేక సంక్షేమ పథకాలు, పోడు భూములకు పట్టాలు, ప్రత్యేక గ్రామ పంచాయతీల ఏర్పాటు, కల్యాణలక్ష్మీ, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణ మాఫీతో లంబాడీల రిజర్వేషన్లకు భంగం వాటిల్లకుండా కాపాడారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్న మంత్రి సీతక్క. ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో కేసులు వేయించాడని తీవ్రంగా ఖండించారు. జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్, జాత్రునాయక్ మాట్లాడుతూ... ఎస్టీ, జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి అని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 26న లంబాడీల భేరి నిర్వహిస్తున్నామని, లంబాడీలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణ నాయక్, టీక్యా నాయక్, కృష్ణా నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

- నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి
- ఈ నెల 28న అచ్చంపేటకు మాజీ మంత్రి కేటీఆర్ రాక



సభాస్థలాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అలవికాని ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని బీఆర్ఎస్ అచ్చంపేట నియోజకవర్గ సమన్వయ కర్త, నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. ఈ నెల 28న అచ్చంపేటకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నందున పట్టణంలోని సభాస్థలాన్ని రాష్ట్ర నాయకులు అభిలాష్‌రావు, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు పోకల మనోహర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మర్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 420 హామీలతో గెద్దెనెక్కి ఇప్పుడు అమలుచేయలేక చెతులెత్తేసిందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను కోరుకుంటున్నారని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. రైతులకు యూరియా సరిగా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, యూరియా కోసం కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న ఈ ప్రభుత్వం కనీసం చర్యలు తీసుకోకుండా దుర్మార్గమైన పాలన చేస్తోందన్నారు. ఈ నెల 28న పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ ఛైర్మన్ తులసీరాం, సీనియర్ నాయకులు మాకం తిరుపతయ్య, అంతటి శివ, రమేష్ రావు, నర్సయ్య పాల్గొన్నారు.

గాలివానకు నేలకొరిగిన వరి పైర్లు



కృష్ణానది ఒడ్డున నేలకొరిగిన వరి పైరు

కృష్ణ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ గాలి, వానకు కృష్ణ మండల పరిధిలోని గుడెబల్లూరు, మురహర్ దొడ్డి గ్రామ శివారులోని కృష్ణానది ఒడ్డున రైతులు సాగు చేసిన వరి పంటలు నేలకొరిగాయి. రాత్రనక పగలనక అనేక కష్టాలు పడి అప్పులు తెచ్చి వరి పొలాలు కౌలుకు తీసుకుని పండిస్తే.. దిగుబడి వచ్చే సరికి గాలి వానకు నేలకొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కృష్ణా, భీమా నదుల ఒడ్డునున్న వరి పైర్లు నేలకొరిగినట్లు రైతులు మంగళవారం తెలిపారు. మండల వ్యవసాయ అధికారుల ద్వారా క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులకు నష్టం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక లారీ పట్టివేత

మానవపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మానవపాడు మండల పరిధిలోని జాతీయ రహదారి 44 మానవపాడు స్టేజీ సమీపంలో మంగళవారం ఇసుక లారీ పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీలోని తాడిపత్రి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా వాహన తనిఖీల్లో ఇసుకలారీని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ జగదీష్, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టరు..

అలంపూరుచౌరస్తా, (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద ఇసుక ట్రాక్టరును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. కానిస్టేబుళ్లు రవికుమార్, అనిల్ కుమార్‌లు మంగళవారం బ్లూకోల్ట్స్ విధులు నిర్వర్తిస్తున్నారు. అదే సమయంలో అనుమతి లేకుండా కర్నూలు వైపు నుంచి అలంపూరు చౌరస్తా వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. అనుమతులు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అలంపూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు మండలంలోని లింగనవాయి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలైనట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు మండలం చెల్లిమిల్ల గ్రామానికి చెందిన గోపాల్ అతని భార్య నాగమణిలు కూలీ పని నిమిత్తం వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడారు. ఈ ఘటనలో నాగమణి అక్కడికక్కడే మృతి చెందగా, గోపాల్‌కు స్వల్పగాయాలయ్యాయి. గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైకు, లారీ ఢీ - యువకుడికి గాయాలు

జడ్చర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురం ఆర్చీ వద్ద మంగళవారం బైకు, లారీ ఢీ కొన్న సంఘటనలో బైకుపై ఉన్న యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల మండలం చిన్నఆదిరాల గ్రామానికి చెందిన ఒబేదుల్లా అనే యువకుడు తన తల్లితో పాటు సోదరిని బైకుపై ఎక్కించుకుని జడ్చర్లకు బయలుదేరాడు. గంగాపురం ఆర్చీ వద్ద జాతీయరహదారిపై నుంచి జడ్చర్ల వైపు మళ్లుతుండగా లారీని ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో ఒబేదుల్లా తలకు, ఇతర భాగాలలో గాయాలయ్యాయి. గాయపడిన యువ కుడిని 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించినట్లుగా స్థానికులు తెలిపారు.

కొండచిలువ కలకలం

» 6 అడుగుల పాము పట్టివేత


కొండ చిలువను బంధించిన కృష్ణ సాగర్

వనపర్తి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వనపర్తి పట్టణంలోని చిట్యాల పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న పాత ఇనుప సామాన్ గోదాంలో మంగళవారం కొండచిలువ కలకలం రేపింది. యజమాని తాజావుద్దీన్ తన పాత ఇనుప సామాన్ గోదాము షటర్ ఓపెన్ చేయగా అకస్మాత్తుగా ఆరడుగుల కొండ చిలువ కనబడడంతో భయాందోళనకు గురయ్యారు. వెంటనే తన స్నేహితుడు చిలుక కుమార్ సాగర్‌కు సమాచారం అందించారు. కుమార్ వెంటనే వనపర్తి జిల్లా కేంద్రంలోని సాగర్ స్నేక్ సొసైటీ చీర్ల కృష్ణ సాగర్ సమాచారం ఇచ్చారు వెంటనే కొండ చిలువ ఉన్న ప్రాంతానికి చేరుకొని సంచుల మధ్యలో నక్కి ఉన్న కొండ చిలువను సురక్షితంగా బంధించడంతో వాహనదారులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. కొండ చిలువ ఆరడుగులు, 8 కిలోల బరువు ఉందని కృష్ణ సాగర్ తెలిపారు. స్నేక్ సొసైటీ సభ్యులు కుమార్ సాగర్, అవినాష్ ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురి రిమాండ్

గద్వాల క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని దౌదర్‌పల్లికి చెందిన మధు అనే వ్యక్తిపై ఇటీవల కొందరు యువకులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో మంగళవారం నలుగురు యువకులను రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఇటీవలే దౌదర్‌పల్లికి చెందిన మధు అనే వ్యక్తి ఇంటిపైకి దాదాపు 20 మంది యువకులు మద్యంతాగి కర్రలు, రాడ్‌లతో ఇంటితలుపులను పగలకొట్టి.. మధుపై హత్యాయత్నం చేసేందుకు రావడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే సీసీ కెమెరాల ఆధారంగా ఇంటిమీదకు వచ్చిన వారిలో సోను, అంజి, గోపి, శభాస్ అనే యువకులు ఉండటంతో వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. అయితే ఇందులో మరికొందరు ఉన్నారని, వారిపై కూడా విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

జడ్చర్లలో ఇద్దరు..

జడ్చర్ల,(ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని గంగాపురం వెళ్లే దారిలోని ఓ హోటల్ వద్ద సోమవారం జరిగిన ఇరువర్గాల దాడి, హత్యాయత్నం కేసులో ఇద్దరిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. ఈ కేసులో నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. మరో ఇద్దరు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, డిశ్చార్జ్ అయిన అనంతరం వారిని సైతం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిం చనున్నట్లు పేర్కొన్నారు.

9 క్వింటాళ్ల బెల్లం పట్టివేత

లింగాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : 9 క్వింటాళ్ల బెల్లం స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ముందు బైండోవర్ చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుందిని ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు. వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన నల్లబోతుల హరీష్ అనే వ్యక్తి సోమవారం రాత్రి మండలంలోని మగ్దూంపూర్ చౌరస్తాలో ట్రాలీ ఆటోలో బెల్లం తరలిస్తున్నాడు. అదే సమయంలో ఎక్సైజ్ శాఖ సిబ్బందితో గస్తీ తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను ఆపి చూడగా, 9క్వింటాళ్ల బెల్లం తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి తహసీల్దార్ పాండునాయక్ ముందు హాజరుపర్చగా, రూ.2లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రమేశ్ (ఫైల్)

హన్వాడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గొడవతో భర్త ఉరేసుకొన్న సంఘటన మండలంలోని మునిమోక్షం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిమోక్షం గ్రామానికి చెందిన కాశీపూరం రమేశ్ (27), తన భార్య కవిత మధ్య తరచూ గొడవలు జరిగేవి. గత నెలలో జరిగిన గొడవతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 21న తన పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి కొనఊపిరితో ఉన్న అతన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి అదృశ్యం

నవాబ్‌పేట/హన్వాడ/బాలానగర్/భూత్పూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలు ప్రాంతాల్లో నలుగురు అదృశ్యమయ్యారు. నవాబ్‌పేట మండలంలోని లోకిరేవు గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్లు ఏఎస్‌ఐ జనార్దన్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన ప్రవీణ్ ఈ నెల 20న మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతని సెల్‌కు ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో ఆందోళన చెందిన తండ్రి సత్యయ్య బంధువులు, స్నేహితుల వద్ద వెతికాడు. జాడ తెలియకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● హన్వాడ మండలంలోని పిల్లిగుండు తండాకు చెందిన సభావత్ రాజునాయక్(27) కనిపించకుండా పోయినట్లు ఎసై వెంకటేష్ తెలిపారు. ఈ నెల 14న ఇంటి నుంచి పనికి పోయిన ఆతడు అదృశ్యం అయ్యాడు. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్దకు వెళ్లి వెతికినా సమాచరం లేకపోవడంతో తల్లి శివాబాయి మంగళవారం ఫిర్యాదు చేసింది.

● బాలానగర్ మండల కేంద్రానికి చెందిన రాజు పటేల్ (14) గీతాంజలి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 22న గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి పూజ చూసి వస్తానని ఇంటి ఉదయం 10గంటల సమయంలో వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో మంగళవారం పోలీసులకు రాజు పటేల్ తండ్రి శివరాజ్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

● భూత్పూర్‌లో మంగళవారం ఎంబ్రాయిడరీ వర్క్ చేసుకొని జీవిస్తున్న ఓ వివాహిత అదృశ్యం అయ్యింది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మూసాపేట మండలంలోని జానంపేట గ్రామానికి చెందిన సూర్య శివశంకర్‌గౌడ్‌తో జడ్చర్ల గ్రామానికి చెందిన సూర్య చేమంతితో 15సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భూత్పూర్‌లో ఆమె షాపు అద్దెకు తీసుకొని ఎంబ్రాయిడరీ వర్క్ చేస్తున్నది. ప్రతీ రోజు జానంపేట గ్రామం నుంచి భూత్పూర్‌కు వచ్చి పనిచేసుకొని తిరిగి సాయంత్రం తన గ్రామానికి వెళ్లేది. అయితే ఈ నెల 21వ తేదీన సూర్య చేమంతి షాపు నుంచి ఇంటికి తిరిగి రాలేదు. కంగారు పడిన భర్త సూర్య శివశంకర్‌గౌడ్ భార్యకు ఫోన్ చేశాడు. ఆమె ఫోన్ కలువలేదు. తెలిసిన బంధువుల ఇళ్లలో భార్య ఆచూకీ కోసం వెతికాడు. అయినా ఫలితం లేకపోవడంతో మంగళవారం భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆక్రమణల తొలగింపునకు
మీనమేషాలు

» కోర్టు ఆదేశాలు ఉన్నా పట్టింపులేని అధికారులు
» యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
» పట్టణంలో కనుమరుగవుతున్న పది శాతం పబ్లిక్ స్థలాలు
» ధిక్కరణ వ్యాజ్యాల బాటలో ఫిర్యాదుదారులు


కుంట వీధిలో పది శాతం స్థలంలో సాగుతున్న అక్రమ నిర్మాణం

గద్వాల టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గద్వాల పట్టణ పరిధిలో గడచిన కొన్నేళ్లుగా సాగిన అక్రమ నిర్మాణాల తొలగింపుపై అధికారులు చర్యలు నామమాత్రమయ్యాయి. ఫిర్యాదిదారులు చేస్తున్న ఒత్తిడి ఆధారంగా కొన్నిచోట్ల తొలగింపులు నామమాత్రంగానే చేపట్టిన అధికారులు మిగతా వాటిపై దృష్టి సారించక పోవడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. వీటికి తోడు పట్టణ పరిధిలో అధికారికంగా ఏర్పాటైన లేఅవుట్లలోని పది శాతం పబ్లిక్ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. వీటికి సంబంధించి కొన్ని చోట్ల పనులను అర్ధాంతరంగా ఆపివేసిన అధికారులు తుదిపరి చర్యలపై ముందుకు కదలడం లేదు.

● **ప్రధాన ఫిర్యాదులు**

పట్టణంలో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2005లో అధికారికంగా ఏర్పాటుచేసిన కొత్త హౌసింగ్ బోర్డు కాలనీ లేఅవుట్‌లో 80 అడుగులు రోడ్డును ఆనుకుని రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రార్థన స్థలంపై స్థానికులు ఫిర్యాదు చేయగా.. ఇప్పటి వరకు చర్యలు లేవు. ఫిర్యాదిదారులు 2016లోనే కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం రిమూవల్ ఆర్డర్ (డ్ల్యూపీ నెంబర్ 20745/2016) అప్పట్లోనే కూల్చివేత ఆదేశాలు ఇవ్వగా, ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు. ఇదే విషయమై గత కొన్నేళ్లుగా పలు పర్యాయాలు కొత్త హౌసింగ్ బోర్డు కాలనీ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా.. చర్యలు శూన్యం.

● పట్టణంలోని పెద్దాసుపత్రి వెనుక భాగంలోని ఎంకేఎస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణం పదిశాతం స్థలంలో జరిగిందని సమీపంలోని ప్రైవేటు కళాశాల యాజమాన్యం ఫిర్యాదు చేసి కోర్టును ఆశ్రయించారు. 2024 ఏప్రిల్ 22న నిబంధనల మేరకు చర్యలు చేపట్టి, ఆ స్థలం ఓపెన్ స్పేస్‌గా ఉంచాలంటూ న్యాయస్థానం ఆదేశించింది. దానిపై మునిసిపల్ అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో వారు ధిక్కరణ వాజ్యం వేయగా, న్యాయస్థానం షోకాజు నోటీసులు జారీ చేసింది. దానిపై స్పందించిన అప్పటి కమిషనర్ 2014 మే 10న కల్యాణ మండపాన్ని సీజ్ చేశారు. వాస్తవానికి సీజ్ చేసే అధికారం కమిషనర్‌కు లేకపోగా కోర్టు ఆదేశాల మేరకు స్థలాన్ని ఓపెన్ స్పేస్‌గా ఉంచాల్సి ఉన్నా కేవలం సీజ్ చేసి చేతులు దులుపుకున్నారంటూ ఫిర్యాదిదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే న్యాయస్థానానికి ఫిర్యాదు చేసినా తదుపరి చర్యలకై వేచి చూస్తున్నారు.

● స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐడీఎస్ఎంటీ కాలనీలో పదిశాతం పబ్లిక్ స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించాలంటూ పలుమార్లు కాలనీ వాసులు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు ఆలస్యంగా స్పందించిన అధికారులు గుడిసెలు తొలగించుకోవాలంటూ మౌఖికంగా హెచ్చరికలు చేశారు. అయితే, ఎలాంటి చట్టపరమైన చర్యలకు సిద్ధం కాలేదంటూ స్థానికులు, ఫిర్యాదిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● స్థానిక కుంటవీధిలోని అధికారిక లేఅవుట్‌లో పదిశాతం స్థలాన్ని ఆక్రమించుకున్న మాజీ ఉద్యోగి ఒకరు ఇంటి నిర్మాణం చేపట్టగా, దానిపై మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు అందినా స్పందించక పోవడంతో ఫిర్యాదిదారులు కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం తొలగింపునకు ఆదేశాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా చర్యలు లేకపోవడంతో అదే ఫిర్యాదిదారులు తిరిగి కోర్టు ధిక్కరణ కేసు వేయాల్సి వచ్చింది. కాగా, ఈ స్థలం గతంలో ఇందిరమ్మ ఇంటి స్థలం పట్టా ఉందంటూ నిర్మాణదారులు చెబుతుండటం విశేషం.

కౌన్సిల్ తీర్మానాలపై అనుమానాలు

పట్టణ పరిధిలో దాదాపు 70కి పైగా అధికారిక లేఅవుట్‌లు వేయగా పబ్లిక్ అవసరాల కోసం నిర్దేశించిన పదిశాతం స్థలాలు మునిసిపాలిటీ పేరున రిజిస్టర్ అయి ఉన్నా వాటికి రక్షణ లేదంటూ పలువురు ఫిర్యాదు దారులు ఆరోపిస్తున్నారు. ఈ స్థలాలను మునిసిపల్ కౌన్సిల్‌లోనే తీర్మానాల ద్వారా ఇతరులకు కట్టబెట్టారని, ఇది నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదిదారులు చెబుతున్నారు.

● **చట్టపరంగా చర్యలు తీసుకుంటాం**



అక్రమ నిర్మాణాలను అనుమతించేది లేదు. ఇప్పటి వరకు ఉన్న ఫిర్యాదుల ఆధారంగా పరిశీలన చేపట్టాం. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఉన్నచోట తొలగిస్తాం. పదిశాతం పబ్లిక్ స్థలాలన్నింటిని గుర్తించి కంచె ఏర్పాటు చేయడంతో పాటు నేమ్‌బోర్డు ఏర్పాటు చేయనున్నాం. న్యాయస్థానం ఆదేశాలు ఉన్న చోట చర్యలు తీసుకుంటాం.

- జానకీరామ్ సాగర్, మునిసిపల్ కమిషనర్

కొడంగల్ దశ దిశ మార్చడమే లక్ష్యం

» కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి


ఆసుపత్రిలో మార్చురీ నిర్మాణానికి భూమిపూజచేస్తున్న తిరుపతిరెడ్డి

కోస్గి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రానున్న మూడేళ్లలో కొడంగల్ దశదిశ మార్చడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం కోస్గి మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో 30 లక్షలతో నిర్మించిన అదనపు తరగతిగదులను ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పించాలని ఎక్కడా ఇబ్బందిలేకుండా చూసుకోవాలని డీఈవో గోవిందరాజులు, ఎంఈవో శంకర్‌నాయక్‌ను ఆదేశించారు. అనంతరం కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.35 లక్షలతో మార్చురీ నిర్మాణానికి, మరో రూ.15 లక్షల తో ఆసుపత్రికి వచ్చిన రోగులు కూర్చునేం దుకు హాల్, మరో 12 లక్షలతో ఆసుపత్రి ప్రహరీ నిర్మాణానికి భూ మిపూజ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని వసతుల ను పరిశీలించారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయంలో రూ.30 లక్షలతో నిర్మించిన ఏడీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కోస్గి సబ్‌డివిజన్ పరిధిలో పని చేస్తున్న స్పాట్‌బిల్లర్స్ అంతా తాము ఎంతో కాలంగా పనిచేస్తున్నామని తమను విద్యు త్‌శాఖ ఉద్యోగులుగా గుర్తిం చాలని వినతిప త్రం అందించారు. కార్యక్రమంలో కాడ అధికారి వెంకట్‌రెడ్డి, పీఆర్‌డీఈ విలోక్, వైద్యులు అనుదీప్, విద్యుత్‌శాఖ ఎస్పీ వెంక టరమణ, డీఈ నర్సింగ్‌రావ్, ఏడీ సుధారా ణి, ఏఈ వెంకటేష్, కాంగ్రెస్ మండల అ ధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బెజ్జు రాములు, నాయకులు నరేందర్ అ న్నకిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల గొడవ

» ఓ లారీ ఓనర్‌పై ముగ్గురి దాడి, పోలీసులకు ఫిర్యాదు

జడ్చర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని నాగసాల సమీపంలోని జడ్చర్ల లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అసోసియేషన్ నూతన కార్యవర్గం అంశంపై సభ్యులంతా మంగళవారం సమావేశం నిర్వహించుకున్నారు. సమావేశంలో చర్చించాల్సిన అంశాలలో సభ్యుల మధ్య వాగ్వాదం కాస్తా గొడవగా మారింది. అసోసియేషన్‌లోని సభ్యులంతా ఇప్పటికే రెండు గ్రూపులుగా విడిపోయారు. ఒక గ్రూపునకు చెందిన ఇద్దరు వ్యక్తులపై మరో గ్రూపు వారు దాడికి పాల్పడ్డారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నికలు నిర్వహించి ఎన్నుకుందామని ఓ వర్గానికి చెందిన సభ్యులు, ఇప్పటికే నూతన కార్యవర్గం ప్రకటించడం జరిగిందంటూ మరో వర్గం సభ్యులు వాగ్వాదం చేసుకున్నారు.

ఈ అంశం ప్రస్తుతం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి దృష్టిలో ఉందని, త్వరలోనే సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారని, కొంత సంయమనం పాటించాలంటూ కొందరు సభ్యులు సమావేశంలో సూచించారు.

ఇదే సందర్భంలో లోడింగ్ అంశంలో కార్యాలయం వద్ద నిలబడిన తనపై తన సోదరుడు అజర్‌పైన ముగ్గురు వ్యక్తులు దాడి చేసారంటూ జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో అజహర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అంశంపై ఉద్రిక్తత నెలకొనడంతో సభ్యులంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఒక లింక్‌తో రూ.3 లక్షలు స్వాహా

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు సైబర్ నేరగాళ్ల ఆగడాలు పేట్రేగిపోతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో నివాసం ఉంటున్న వసంత్ అనే వ్యక్తి సైబర్ నేరగాళ్లు పంపిన ఒక మేసేజ్‌ను క్లిక్ చేయడంతో తన అకౌంట్‌లో నుంచి సోమవారం రాత్రి 3లక్షల రూపాయలు మాయమైనట్లు బాధితులు మంగళవారం ఆందోళన వెలిబుచ్చారు. తనకు ఫోన్‌కు వచ్చిన ఒక మెసేజ్‌ను తాను ఓపెన్ చేసే వరకు తన బ్యాంకు ఖాతాలో 3లక్షలు మాయమైనట్లు అయన పేర్కొన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఆన్‌లైన్‌లో సైబర్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు అతను పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అయిజ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. చిన్నతాండ్రపాడు గ్రామంలో మంగళి కృష్ణమూర్తి పాడుబడిన ఇంటి ముందు పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేసినట్లు తెలిపారు. ఇందులో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 6 సెల్ ఫోన్లు, రూ. 15,730 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

» జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్


మాగనూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న డీఐజీ

మాగనూరు/మక్తల్/నర్వ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రమ శిక్షణతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్.ఎస్.చౌహాన్ పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో తనిఖీ చేశారు. ముందుగా పోలీసులచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో డీఐజీ మాట్లాడుతూ ప్రజలకు ఇంకా చేరువయ్యే విధంగా విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ గ్రామాల్లో పర్యటిస్తూ సేవలందించాలన్నారు. అక్రమ వ్యాపారాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రాంలాల్, ఎస్‌ఐ అశోక్‌బాబు, ఏఎస్‌ఐ మన్నన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● మక్తల్‌లో ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ వార్షిక తనిఖీ నిర్వహించి మాట్లాడారు. విలేజ్ పోలీసులు తమకు కేటాయించిన గ్రామాల్లో విధిగా పర్యటించాలన్నారు. అనంతరం మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటి పోలీసుల పనితీరు, రికార్డుల నిర్వహణ, ప్రజాసేవలపై విపులంగా సమీక్షించారు.

డీఎస్పీ ఎన్.లింగయ్య, సీఐ రాంలాల్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

● నర్వ పోలీస్ స్టేషన్‌కు మంగళవారం జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ నర్వ సర్కిల్ ఆఫీస్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం సర్కిల్ ఆఫీస్ రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రాజేందర్ రెడ్డి, ఎస్‌ఐ రమేష్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక ఎత్తుకెళ్లారు..


ఇసుక సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు(ఫైల్)

కృష్ణ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకను, అర్ధరాత్రి అక్రమదారులు తీసుకువెళ్లిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని గుడేబల్లూరు గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఉమ్మడి మాగనూరు మండలం పెద్ద వాగు నుంచి పట్టపగలు యథేచ్ఛగా హిటాచీ ద్వారా టిప్పర్‌లో లోడు చేసి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక విక్రయిస్తున్నారు. ఖాన్‌దొడ్డి గ్రామ శివారులోని ఇటుకల బట్టీల దగ్గర రెండు టిప్పర్ల ఇసుకను డంపు చేశారు. అర్ధరాత్రి టిప్పర్లలో లోడ్ చేసి కర్ణాటక రాష్ట్ర యాదగిరి జిల్లా కేంద్రానికి తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. ఈ ఇసుక డంపు విషయమై రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు సమాచారం అందించారు. దీంతో సోమవారం సాయంత్రం మండల ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్ ఇసుక డంపును సీజ్ చేసినట్లు తెలిపారు. కాగా, అర్ధరాత్రి ఇసుక డంపు వద్ద సిబ్బందిని కాపలా పెట్టినా హిటాచీ ద్వారా టిప్పర్లలో తరలించినట్లు తెలిసింది. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీనివాస్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇసుక తరలించుకుని వెళ్లిన వ్యక్తిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మాగనూరు మండలం వర్కూర్ గ్రామానికి చెందిన లింగప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీద్ తెలిపారు.

చిన్నపిల్లల అశ్లీల వీడియోలు

» షేర్‌చేసిన ముగ్గురిపై కేసు నమోదు

వెల్దండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల అశ్లీల చిత్రాలను ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకుని సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులకు చేరవేస్తున్న ముగ్గురిపై మంగళవారం కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. నాగర్‌క ర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు తమ ఫోన్‌లలో చిన్నపిల్లల అశ్లీల వీడియోలు చూసి వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ఇతరులకు సామాజిక మాధ్యమాల ద్వారా చేరవేస్తున్న వారిపై కేసునమోదు చేశారు. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్‌ఐ పేర్కొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న
గద్వాల సంస్థాన వారసుడు


ఆలయంలో గద్వాల సంస్థాన వారసుడు

అలంపూర్ సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను కుటుంబ సమేతంగా గద్వాల సంస్థాన వారసుడు కృష్ణ రాంగోపాల్ మంగళవారం దర్శించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వీకుల ఆచారాలను ముందుకు తీసుకువెళ్లేందుకు నేను నా కుటుంబం కృషి చేస్తామన్నారు. దసరా, నవరాత్రి ఉత్సవాలకు ఆయన అమ్మవారికి రోజువారిగా గద్వాల చీరలను అందించినట్లు వివరించారు. సమావేశంలో ఆలయ ఈవో దీప్తి పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

మక్తల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22నుంచి 24వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరుగుతున్న 44వ షూటింగ్‌బాల్‌లో బాలికల జట్టు పాల్గొని ఆసిఫాబాద్, మహబూబాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలపై విజయం సాధించినట్లు షూటింగ్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలికల జట్టు ములుగు, కామారెడ్డి, నాగర్‌కర్నూల్, మంచిర్యాలతో ఆడి రన్నర్‌గా నిలిచిందన్నారు. పేట జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, కోచ్‌లు స్వప్న, దివ్య, కళ్యాణి, ప్రవీణలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా జట్టులో బాదేపల్లి విద్యార్థులు


క్రీడాకారులను సన్మానించిన రవిశంకర్

జడ్చర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో జరిగే ఫుట్‌బాల్ అండర్-19 విభాగంతో పాటు సీనియర్స్ విభాగాలలో ఉమ్మడి పాలమూరు జిల్లా జట్టులో బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఆసీఫ్, హర్ష, రిషి, మంజునాథ్, వంశీ, చరణ్, నరేశ్, ప్రకాశ్, కల్యాణ్, జహంగీర్, సామ్యూల్, రామ్, లక్ష్మణ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ శతాబ్ది ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బాదిమి రవిశంకర్ సన్మానించారు. ఈ నెల 25 నుంచి మహబూబ్‌నగర్‌లో సీనియర్స్ విభాగంలో ఎంపికైన క్రీడాకారులు, జనగాంలో జరిగే అండర్-19 విభాగంలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని పీఈటీ మోయిన్ తెలిపారు.

సౌత్‌జోన్ క్రీడాకారుల ఎంపిక


మాట్లాడుతున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీలో కబడ్డీ మహిళలు, పురుషుల విభాగంలో క్రీడాకారులను మంగళవారం ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు పాలమూరు యూనివర్సిటీలోని అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిని పీయూ పీడీలు సెలక్షన్ కోచ్‌లు ఎంపికలు జరిపి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి బాలురకు కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీ మహిళలకు తమిళనాడులోని వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్ యూనివర్సిటీలో జరుగు ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ గేమ్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యభాస్కర్, పీయూ పీడీ డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

న్యూస్ బాక్స్

నల్లకుంట చెరువు పరిశీలన

జడ్చర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో బతుకమ్మల నిమజ్జనానికి నల్లకుంట (మినీ ట్యాంకుబండు) చెరువును మంగళవారం మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి పరిశీలించారు. నాయకులు కోనేటి నర్సిములు, వెంకటేశ్, ఎర్ర ఆనంద్ పాల్గొన్నారు.

నేడు కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలపై సమీక్ష

చిన్నచింతకుంట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు త్వరలో ప్రారంభం కానుండటంతో నేడు సమీక్ష నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మధనేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యంలో ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోయిల్‌సాగర్ నుంచి నీటి విడుదల

దేవరకద్ర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్‌కు ప్రాజెక్టు నుంచి రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా, మంగళవారం సాయంత్రం నాటికి ప్రాజెక్టు నీటిమట్టం 32.2 అడుగులకు చేరింది. అధికారులు రెండు గేట్ల ద్వారా దిగువకు 3000 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

టీజీపీఎస్సీ మెంబర్‌గా రాథోడ్ నియామకంపై హర్షం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ (తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్) మెంబర్‌గా పీయూ మాజీ వీసీ, జాతీయ క్రీడాకారుడు డాక్టర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ నియమితులు కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి పీడీలు, జాతీయ క్రీడాకారులు దామోదర్‌రెడ్డి, ఆనంద్, రమేస్‌చందర్, నర్సింహులు, జగదీష్, జయప్రద, వంశీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

నవాబ్‌పేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని కాంగ్రెస్ నాయకుడు, డీసీసీ మాజీ అధికార ప్రతినిధి జనుంపల్లి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొల్లూర్‌లో దసర పండుగ సందర్భంగా ఏర్పాటు ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ను కాంగ్రెస్ నాయకులు వాసుయాదవ్, వెంకటేష్‌గౌడ్, నరసింహచారి, కృష్ణయ్యతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రామకృష్ణ, రమేష్‌గౌడ్, ఉమ్మర్, అమరేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జడ్చర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 19 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మాలిక్ షాకీర్, వెంకటేశం, నిత్యానందం, అశోక్‌యాదవ్, మినాజ్, సర్ఫరాజ్, ఆనంద్, నరసింహయాదవ్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

మహమ్మదాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌బీఐ ఖాతాదారులు తప్పని సరిగా ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా ఎల్‌డీఎం చంద్రశేఖర్, నంచర్ల బ్రాంచ్ మేనేజర్ మాణిక్యేశ్వరి అన్నారు. మంగళవారం నంచర్ల ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఖాతాదారులకు ఈకేవైసీ, బ్యాంక్ సేవలపై అవగాహన నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, మాజీ మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయుష్ డిస్పెన్సరీలో ధన్వంతరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్యసేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయుర్వేదిక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ సురేష్‌చౌహాన్, జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఆదిశేషయ్య మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యానికి మూల పురుషుడు ధన్వంతరి అన్నారు. ఆయు ర్వేదిక్ డాక్టర్లు సురేష్, ఫహీం, ఫార్మసిస్టు పట్టాభి, చంద్రయ్య, ఎంఎన్‌వో శాబాజ్ పాల్గొన్నారు.

'సదస్సును విజయవంతం చేయాలి'

పాలమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చైతన్య మహిళా సంఘం ఆవిర్భవించి 30ఏళ్ల అవుతున్న సందర్భంగా ఈనె 24న కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించే సదస్సును విజవయంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కో-కన్వీనర్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం తాటికొండలో కరపత్రం విడుదల చేసి మాట్లాడారు.

జలదిగ్బంధంలో వల్లూరు ఎస్సీ కాలనీ

» సహాయక చర్యలు చేపట్టాలంటూ అధికారులకు విజ్ఞప్తి



వల్లూరు ఎస్సీ కాలనీలో వరదనీటిలో మునిగిన ఇల్లు



తుమ్మలకుంటతండా సమీపంలో తెగిన చెరువు కట్ట

జడ్చర్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లూరు గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీ వరద నీటిలో మునిగింది. సమీపంలోని తుమ్మలకుంటతండా చెరువు కట్ట తెగిపోవడంతో నీళ్లన్నీ వల్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీవైపునకు వచ్చాయి. దీంతో కాలనీలోని 11 కుటుంబాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రెండు రోజుల క్రితం రాత్రి వేళ కురిసిన వర్షానికి వర్షం నీళ్లన్నీ కాలనీలోకి వచ్చిచేరాయి. దీనికి తోడు చెరువు కట్ట తెగి నీళ్లన్నీ ఇదే కాలనీలోకి వచ్చి చేరడంతో కాలనీలో నివాసం ఉంటున్న 11 కుటుంబాలకు చెందిన వారంతా ఇంట్లో నుంచి బయటికి కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ప్రతీ సంవత్సరం భారీ వర్షం పడితే నీళ్లన్నీ కాలనీలోకి వస్తాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ఉదండాపూర్ గ్రామం, ఐదు తండాలతో పాటు వల్లూరు గ్రామం ముంపునకు గురవుతుందని, పునరావాసం కింద కేటాయించే ప్లాట్లను త్వరితగతిన కేటాయించాలని కోరుతున్నారు.

కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టుకుంటామని, వరద నీటిలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

డాక్టర్లపై దాడులు చేస్తే ఊరుకునేది లేదు

» జనరల్ ఆసుపత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న డాక్టర్లు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణాలు కాపాడే డాక్టర్లపై దాడులు చేయడం అలవాటుగా మారిందని, ఇకపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగా అజ్మీర హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లాలోని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై దాడిని ఖండిస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి ఎదుట డాక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో ఓ రోగి అత్యవసర విభాగానికి వచ్చిన అరగంటలోపే చనిపోయాడని, డాక్టర్లే చంపేశారంటూ మరుసటి రోజు రోగి బంధువులు ఆందోళన చేయడమే కాకుండా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కొట్టడం ఎంతవరకు సమంజసమని అన్నారు. రోగుల ప్రాణాలు కాపాడటానికే డాక్టర్లు ఉన్నారని, ప్రాణాలు కాపాడే దేవుడి స్థానంలో ఉన్న డాక్టర్లపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డాక్టర్ల భద్రతకు సంబంధించి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. డాక్టర్లపై దాడులు చేసిన వారిని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గాయత్రీ దేవిగా రేణుకాఎల్లమ్మ అమ్మవారు



అన్నపూర్ణాదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కావేరమ్మపేట బంగారు మైసమ్మ ఆలయంలో గాయత్రీ దేవిగా అమ్మవారు



కోయిలకొండ వీరభద్రస్వామి ఆలయంలో గాయత్రీ దేవిగా..



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

గాయత్రీదేవీ నమోస్తుతే..

» కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు » చంద్రప్రభ వాహనంపై పల్లకీ సేవ



న్యూ బాలాజీనగర్‌లో పూజలో పాల్గొన్న శ్రీనిధి అపార్ట్‌మెంట్ మహిళలు



నరసింహస్వామి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/జడ్చర్ల/నవాబ్‌పేట/ దేవరకద్ర/కోయిలకొండ/హన్వాడ/ చిన్నచింతకుంట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోనూ.. గ్రామాల్లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం రెండోరోజు వైభవంగా కొనసాగాయి. బ్రాహ్మణవాడిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో, శ్రీనివాసకాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాసకాలనీలోని పంచముఖి ఆలయంలో గౌరీదేవీగా అలంకరించారు. అదే విధంగా పట్టణంలోని ఆయా ఆలయాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద అమ్మవారికి కుంకుమార్చన, మంగళహారతి, అన్నప్రసాదాల విక్రయ కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని చంద్రప్రభ వాహనంపై పల్లకీసేవ న్విహించారు. శ్రీనివాసకాలనీలో పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్చర్ల సాయినగర్ కాలనీలోని సకల దేవతల ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవీగా దర్శనమివ్వగా సామూహిక కుంకుమార్చన, లక్ష పుష్పార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. పట్టణంలోని వాసవీకన్యకపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని అభిరామిదేవీ అలంకారంలో దర్శనమివ్వగా, అభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. విద్యానగర్‌కాలనీలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో, కావేరమ్మపేట బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రీదేవీగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవాబ్‌పేట మండలం పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు గాయత్రీదేవీగా దర్శనం ఇవ్వగా, ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. దేవరకద్ర మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి, వాసవీ ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కోయిలకొండ మండల కేంద్రంలోని లక్ష్మీ నృసింహస్వామి, వీరభద్రస్వామి, ఆది ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గామాత విగ్రహాల వద్ద కుంకుమార్చన చేశారు. వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవీగా దర్శనం ఇచ్చారు. హన్వాడ మండలం నాయినోనిపల్లిలో దుర్గాదేవీ, చిన్నచింతకుంట మండల కేంద్రంలోని మాతా గంగాభవానీ గాయత్రీదేవీగా దర్శనమిచ్చారు.

విద్యార్థుల క్రమశిక్షణపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి

కోయిలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కళాశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత తల్లిదండ్రులు వారి క్రమశిక్షణపై దృష్టి పెట్టాలని జూనియార్ కళాశాల ప్రిన్సిపాల్ బాలనారాయణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కళాశాలలో ఉన్నప్పుడు తమ బాధ్యత, ఇంట్లో తల్లిదండ్రులదే బాధ్యత అన్నారు.విద్యార్థులు చెడు మార్గంలో వెళ్ళకుండ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం చేస్తే ఊరుకోం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ నాయకులు

మహమ్మదాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేష్, బీజేపీ మండల అధ్యక్షుడు మూస నర్సింహులు అన్నారు. మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. బీసీ జాబితాలో లేని కురువలను బీసీల్లో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే బీసీలు విద్య, ఉపాధి అవకాశాలు కోల్పోయారని, ఇలాగే కుల మార్పిడి జరిగితే బీసీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని హెచ్చరిచారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు వేణుగౌడ్, కిష్టయ్య, శ్రీనివాస్, యాదగిరి, గోపాల్, సత్యం, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

మూసాపేట/మిడ్జిల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములలో సేవా పక్వాడ్‌లో కార్యక్రమంలో భాగంగా కందూరు రాంరెడ్డి లయన్స్ వారి తరఫున కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు జ్యోతి, జరీనా, రామస్వామి 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 60 మందికి కంటి అద్దాలు, 21 మందికి కంటి ఆపరేషన్ కోసం అనుపత్రికి తరలించారు. బీజేపీ మండల అధ్యక్షుడు టీకే నరసింహ, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కొండారెడ్డి, భాస్కర్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, నరేష్, జలేంధర్‌రెడ్డి, రమేష్, చెన్నయ్య, ప్రవీన్, సాయి, విష్ణు, అశోక్‌రెడ్డి, భీమన్న, చంద్రశేఖర్‌రెడ్డి, రఘుపతి ఉన్నారు. మిడ్జిల్ మండలం వెలుగొమ్ములలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివకాంత్ ఆధ్వర్యంలో షుగర్, బీపీ, హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. క్షయ అనుమానితులుగా ఉన్న 25 మందికి స్ఫూటం శాంపిల్స్‌ను సేకరించారు. అవసరమున్న వారికి మందులను అందజేశారు. డాక్టర్ శశాంక్, కమ్యూనిటీహెల్త్ అధికారి అయూబ్‌ఖాన్, హెల్త్ అసిస్టెంట్ దేవయ్య, జీఎన్ఎం నరేష్, ఏఎన్‌ఎంలు రాజేశ్వరి, అంజలమ్మ, పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ పాల్గొన్నారు.

రేపు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై సదస్సు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై 25న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళా భవన్‌లో సాయంత్ర 4 గంటలకు సదస్సు, కవితా గానం, ఛాయాచిత్రాల ప్రదర్శన ఉంటుందని తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్షుడు ఖాజా మైనుద్దీన్, సాంస్కృతిక కేంద్రం జిల్లా కన్వీనర్ కురుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకుడు రమేష్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు హాజరవుతారని, ఉమ్మడి జిల్లా నుంచి కవులు, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొనాలని కోరారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు



కోయిలకొండ పెద్దవాగు

కోయిలకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న వర్షాలకు మండలంలోని అంకిళ్ల పెద్దవాగు, ఆచార్యపూర్ మధ్య గల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దౌల్తాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటితో పెద్దవాగు వంతెన ఆనుకొని ప్రవహిస్తోంది. దీంతో కోయిల్‌సాగర్‌లోకి భారీగా వరదనీరు చేరుతుంది.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు టికెట్లు ఇవ్వాలి'

హన్వాడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు టికెట్లు కేటాయించాలని గొర్రెల కాపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శాంతయ్య పేర్కొన్నారు. టంకరలో మంగళవారం కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య ఆధ్వర్యంలో యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ నర్సయ్యతో కలిసి శాంతయ్య మాట్లాడారు. అన్ని పార్టీల్లో ఉన్న యాదవులకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాదవులు కలసికట్టుగా ఉండి పని చేయాలని, ఎవరికి ఏ సమస్య వచ్చినా అందరు సంఘటితంగా పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం జిల్లా నాయ కులు, వివిధ పార్టీల నాయకులు సాయిలు, రమేష్, కృష్ణయ్య, వెంకటాద్రి, యాదయ్య, రాజు, బాల్‌చెన్నయ్య, జాంగీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు సహకరించాలి : అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి వారి మిల్లింగ్ సామర్థ్యానికి అనుగుణంగా బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు గ్యారెంటీ సమర్పించకుంటే వారికి కేటాయించడం జరగదని స్పష్టం చేశారు. అదే విధంగా ఖరీఫ్, రబీ 2024-25 సీజన్‌లోని సీఎంఆర్ పురోగతిని సమీక్షించి, గడువులోగా డెలివరీలను వేగవంతం చేయాలన్నారు. సీఎంఆర్ బకాయి ఎక్కువ ఉన్న మిల్లరు మిల్‌ను రెండు షిప్టుల్లో రోజు 16 గంటలు ఆపరేట్ చేయాలని, వాటికి సంబంధించిన కరెంటు బిల్‌లను వెరిఫై చేసి రిపోర్ట్‌లను పంపాలని పౌర సరఫరాల శాఖ డీటీలను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలకు సీఎంఆర్‌ని ప్రతీ రోజు మిల్లు కెపాసిటీ ప్రకారం డెలివరీ చేపించేలా వారికి టార్గెట్ నిర్ణయించడం జరిగింది. ధాన్యం విషయంలో తేడా వస్తే సంబంధిత డీటీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, మేనేజర్ రవినాయక్ పాల్గొన్నారు.

దళితవాడల్లో సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దళితులు

పాలమూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహ బూబ్‌నగర్ నగరంలోని దళితవాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని దళితులు మునిసిపల్ అధికారులను కోరారు. మంగళవారం మహ బూబ్‌నగర్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని దళితులు కలిసి సమస్యలను ఏకరువు పెట్టారు. 2, 5 వార్డుల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. వార్డుల్లో వీధిలైట్లు, కాలనీల్లో సీసీ రోడ్లు, అయ్యపకొండ పైన వైకుంఠ ధామంలో బోరు, గార్డెన్ ట్రీ కటింగ్, పిచ్చిమొక్కల తొలగింపు, మాదిగల శ్మశానవాటికలో నూతనంగా బోరు వేసి అక్కడ ఒక ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. సిబ్బందితో చర్చించి త్వరలో కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని దళితులు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాదిగ మ్యాతర్ల కమిటీ సభ్యులు మల్లెపోగు శ్రీనివాస్, బడే యాదయ్య, కుడుముల కృష్ణ, గేటు చెన్నయ్య, అనుపలి శివరాములు, కొత్త బాల వెంకటయ్య, కాలె బచ్చన్న, అనుపటి నరసింహులు, చింతకింది రాజు, కుడుముల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

317 బాధితులకు న్యాయం చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని టీ ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అయూబ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా జీవో 317కు ఊరటగా జీవో 190ను విడుదల చేసిందన్నారు. దీన్ని స్వాగతిస్తున్నామని, 317 బాధితులందరికీ సమన్యాయం జరిగే విధంగా గైడ్ లైన్స్ ఇవ్వాలని, క్యాడర్, మేనేజ్‌మెంట్, వేకేన్సీ అని సాకులు చూపకుండా అందరికీ సొంత జిల్లాలో డిప్యుటేషన్‌తో సర్దుబాటు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌ఖాదర్, సభ్యులు సిరాజ్‌ఖాన్ ఫరీద్, సయ్యద్ జైనులాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన బతుకమ్మ పోస్టర్ విడుదల

గండీడ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30న మండలంలోని వెన్నచేడ్ గ్రామంలో బహుజన బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నట్లు మండల బహుజన నాయకులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో బహుజన బతుకమ్మ పోస్టర్ విడుదల చేసి, మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, నాయకులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆశన్న, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు భీమయ్య, ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, సొసైటీ డైరెక్టర్ బాలస్వామి, నాయకులు రాంచంద్రారెడ్డి, సుదర్శన్‌రావు, భవననిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెన్నయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాములు, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు కోట్యానాయక్, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్నారు.

26లోపు నిజామొద్దీన్ మృతదేహం పాలమూరు చేరే అవకాశం

» ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాలమూరుకు చెందిన నిజామొద్దీన్ మృతదేహాన్ని ఈనెల 26 వరకు తెప్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో విదేశీ వ్యవహారాల శాఖ అధికారులను కలిసి మాట్లాడారు. అనంతరం అమెరికా కాన్సులేట్ జనరల్ శ్రీకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. వచ్చే శుక్రవారం నాటికి నిజామొద్దీన్ మృతదేహంతో పాటు అతనికి సంబంధించిన ఫర్నీచర్ హైదరాబాద్ చేరేలా చూస్తామని తెలిపినట్లు ఎంపీ తెలిపారు.